కథ

# ఊటి బాధ

- బి.పి. కరుణాకర్




"గౌరవనీయులైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గారికి,

నమస్కారములతో వి.సదానందం రాయునది. మాది రంగారెడ్డి జిల్లాలోని నర్సిపల్లి. పటాన్ చెరువుకు దగ్గరగా ఉంటుంది. నేను పదిహేను సంవత్సరాల కిందట మీ కంపెనీలో ఉద్యోగ నిమిత్తం శిక్షణ పొందాను. ఆరు నెలలపాటు మెయిన్‌టెనెన్స్ డిపార్టుమెంటులో చాలా పనులు నేర్పించారు. శిక్షణ పూర్తయిన తర్వాత పెట్టిన పరీక్షల్లో మొదటి ర్యాంకులో పాసయ్యాను. నాకంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్లను శిక్షణ పూర్తయిన నాలుగు నెలలకే కొలువులోకి తీసుకున్నారు. ఎందువల్లనో నన్ను కొలువులోకి తీసుకోలేదు. నాకు ఈ మధ్యనే తెలిసిన విషయం ఏమిటంటే మా ఊరి వ్యక్తి, నరసింహం అనే అతను నా పేరు మీద మీ సంస్థలో గత పద్నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని విన్నాను. ఇదెలా జరిగిందో తెలుసుకుందామని ప్రయత్నించాను. కానీ వీలుకాలేదు. నేను బీద రైతును. రెండెకరాల పొలం వుంది. నా విన్నపం ఏమిటంటే, నరసింహం నా పేరు మీద మీ కంపెనీ నుంచి ఎటువంటి లోన్లు తీసుకుని తీర్చకుంటే నేను బాధ్యుడిని కాను. ఆ మధ్య బ్యాంకు వాళ్ళు వచ్చి నా పొలం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాను. సంబంధిత అధికారులకు దయచేసి ఈ విషయం తెలియజేసి నాకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేయమని కోరుకుంటున్నాను.

ఇట్లు
వి. సదానందం"

ఉత్తరం మీద తారీఖు ఉంది. చిరునామా ఉంది. ఆ ఉత్తరంలోని విషయాల గురించి ఆరాతీసి రిపోర్టు సబ్‌మిట్ చేయమని మా సీనియర్ విజిలెన్స్ ఆఫీసరు జోషి పచ్చ సిరాతో ఎండార్సుమెంటు చేశారు.

మా కంపెనీలో జరిగే అవకతవకల గురించి తెలియజేస్తూ అప్పుడప్పుడు ఉత్తరాలు వస్తుంటాయి. ఆరా తీస్తే కొన్ని నిజమవుతాయి, కొన్ని కావు. నేనక్కడకు వచ్చాక అటువంటి ఉత్తరం రావడం అదే మొదటిసారి. సదానందం ఎంతో బాధతో ఉత్తరం రాసినట్టనిపించింది. ఒకటికి నాలుగు సార్లు చదివాను. ఈ సంఘటన జరిగి చాలా సంవత్సరాలు గడిచాయి. అప్పటి అధికారులు చాలా మంది పదవీ విరమణ చేసుంటారు. ఉన్నవాళ్లకు గుర్తుండి ఉంటుందని అనుకోను. కంపెనీ నెలకొల్పిన సమయంలో స్థానికులకు చాలా మందికి ఉద్యోగాలు ఇచ్చినప్పుడు పొరపాటు జరిగే అవకాశం లేకపోలేదు. నిజానిజాలు తెలుసుకోవడానికి సదానందాన్ని మా ఆఫీసుకు పిలిపించడం కన్నా నేనే వాళ్ల ఊరు వెళ్లడం మంచిదనిపించింది.

సదానందం పేరు మీద చలామణి అవుతున్న నరసింహం. పర్సనల్ ఫైలు తెప్పించి చూశాను. ఇద్దరి

సంతకాల్లో అట్టే తేడా కనిపించలేదు. ఫోటో ఒకటి తీసి వేరేది అతికించినట్లుగా పరిశీలనగా చూస్తేగాని తెలియలేదు. భార్య, తల్లిదండ్రుల పేర్ల మీద ట్రావెల్ కన్సెషన్స్ తీసుకుంటున్నాడు. రికార్డుల్లో సదానందం చిరునామా ఉంది. సదానందాన్ని కలుసుకున్న తర్వాత నరసింహాన్ని మా ఆఫీసుకు పిలిస్తే బావుంటుంది.

నర్సిపల్లి వెళ్లి సదానందాన్ని కలుసుకోవడం నాకు కష్టమనిపించలేదు. నేను వెళ్లిన సమయానికి పొలంలో ఒక్కడే కూర్చుని రాళ్లు ఏరి బుట్టలో వేస్తున్నాడు. మనిషి సన్నగా, ఎర్రగా వున్నాడు. అతని పక్కనే కూర్చుని నన్ను నేను పరిచయం చేసుకున్నాక నవ్వి, ''ఉత్తరం రాసినందుకు నా మీద కేసు పెట్టరు కదా?'' అడిగాడు.

''లేదు. ఉత్తరం రాసి నిజాలు మా ముందు ఉంచినందుకు నాకు సంతోషంగా వుంది'' అన్నాను.

''చాలా సంవత్సరాల కిందట మీ ఆఫీసుకు నాలుగైదు సార్లు వచ్చాను. రెండు సార్లు ఉత్తరాలు కూడా రాశాను. ఎవరూ పట్టించుకోలేదు''

''నీ విషయంలో కాకుండా మరెవరి విషయంలోనయినా ఇటువంటి అన్యాయం జరిగిందా?''

''ఒకరిద్దరికి జరిగింది కాని వాళ్లు మీ కంపెనీ ఉద్యోగం కోసం వెంపర్లాడలేదు. సౌదీ వెళ్లిపోయారు. మీ కంపెనీలో ఉద్యోగం దొరికి వుంటే ఎంతో బావుండేది. ఉద్యోగం నా చేతిలోంచి జారిపోయినందుకు గుర్తు వచ్చినప్పుడల్లా బాధగా ఉంటుంది. ఈ భూమి మీద ఎంత కష్టపడినా ఇబ్బందిగానే ఉంటుంది. అప్పుడప్పుడు కూలీ పనులకు వెళ్తుంటాను. నేను కూలీ పనులు చేయడం చదువుకుంటున్న మా పిల్లలకు ఇష్టం లేదు. వద్దంటారు. వాళ్లకు తెలియకుండా వెళ్తుంటాను. సీజన్లలో వేరు శనక్కాయలు, మొక్కజొన్న కండెలూ కాల్చి అమ్మి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. పిల్లలు బాగా చదువుకుంటున్నారు. వాళ్లు పైకి వచ్చేవరకు నాకు ఈ కష్టాలు తప్పవనుకుంటాను..'' ఆగాడు. ''నీకు అన్యాయం ఎవరు చేసి ఉంటారని అనుకుంటావు?''

''మా ఊరి పటేలు. అతని మాటకు ఇప్పటికీ తిరుగులేదు. అతనికి నచ్చని వాడిని నాశనం చేస్తాడు. చుట్టుపక్కల కూడా అతనికి మంచి పలుకుబడి వుంది. ఇక్కడ నరసింహానికి కలిసి వచ్చిన విషయం ఏమిటంటే అతని ఇంటి పేరు, నా ఇంటి పేరు ఒకటే కావడం''

గంటన్నర సేపు సదానందంతో ఉండి నరసింహం వివరాలు తెలుసుకుని వచ్చేస్తుంటే, ''ఇన్ని సంగతులు తెలుసుకున్నారు కదా, ఏం చేయదలుచుకున్నారు?'' అడిగాడు. అతని ప్రశ్నకు ఆ సమయంలో నా దగ్గర జవాబు లేదు. నవ్వేసి నా విజిటింగ్ కార్డు ఇచ్చి, ''నాకు చేతనయినంత వరకు నీకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తాను'' అన్నాను.

''నరసింహం చేసిన అప్పుల్లో నేను ఇరుక్కోకుండా చేయండి, అది చాలు''

పటేలింటికి వెళ్లాను. లేడు. అతను నెలలో మూడు వారాల పాటు హైదరాబాద్‌లో ఉంటున్నాడని, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రెండు చేతులా సంపాదిస్తున్నాడని తెలిసింది. నరసింహం ఇల్లు బయటినుంచి చూశాను. రెండంతస్తుల మేడ అద్దెకివ్వడానికి అనువుగా కట్టాడు. ఈ మధ్యే రెండు కార్లు కొని మా కంపెనీకే అద్దెకిచ్చాడని అక్కడి వాళ్లు ఎవరో అన్నారు.

నోట్ తయారు చేసేముందు నరసింహాన్ని మా ఆఫీసుకి పిలిపించి అసలు విషయం చెప్పమని అడిగినప్పుడు ముందు ఒప్పుకోకపోయినా రెండు గంటపాటు అలానే కూర్చోబెడితే ఏమనుకున్నాడో ఏమో, నిజం చెప్పాడు కాని స్టేట్‌మెంట్ అడిగితే రాసివ్వలేదు. మరసటి రోజు రాలేదు. నాలుగు రోజుల తర్వాత వచ్చాడు, కాని స్టేట్‌మెంట్ రాసివ్వడానికి నిరాకరించాడు. అంతకుముందు వచ్చినప్పుడంతా మెత్తగా ఏం మాట్లాడలేదు. ఆ రోజు నా బలవంతం మీద అలా చెప్పానని ఎదురు తిరిగి మీరేమైనా చేసుకోవచ్చు అన్నట్టు మాట్లాడాడు. ఇటువంటి కేసుల్లో స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించాడని నోట్‌లో రాసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు పంపిస్తాం. ఆయన ఇష్టపడితే కేసు సి.బి. ఐ.కి అప్పగించి చేతులు దులుపుకుంటాం. రూల్సు అందరి విషయాల్లో ఒకేలా వుండవు. రాజకీయ వత్తిళ్లు కూడా ఉంటుంటాయి. మనిషిని బట్టి, పరపతిని బట్టి, యూనియన్ బట్టి, కులం బట్టి రూల్సు మారుతుంటాయి. అన్ని సంస్థలలో పరిస్థితి ఇలానే ఉంటుందేమో నాకు తెలియదు.

నరసింహం నా గదిలోంచి బయటకు వెళ్లబోతూ ఆగి, నా ముందుకు వంగి జేబులోంచి వంద రూపాయల నోట్ల కట్ట తీసి నా బల్ల మీదున్న ఫైలు కింద పెట్టి, ''పదివేలు తీసుకుని కేసు మూసేయండి. మూసేసిన తర్వాత మరో పదివేలిస్తాను'' చిన్నగా అన్నాడు. అతని ముఖంలోకి కోపంగా చూశాను. ఆ సందర్భంలో అతని మీద అరవడం నాకు ఇష్టం లేదు. ఒకవేళ అరిచినా నేనే లంచం తీసుకు రమ్మన్నానని అన్నా నేనేం చేయలేను. నేను ఎటువంటి వాడినో తెలిసి కూడా నిజమని ఆదుకునే వాళ్లు ఉండకపోరు. ''నేను అటువంటి వాడిని కాదు. దయచేసి తీసుకెళ్లు'' అతను అన్నంత చిన్నగానే అన్నాను. వెంటనే తీసుకోలేదు. ''నీకే చెబుతుండా'' అనేసరికి నా కళ్లల్లోని తీవ్రత గమనించి నోట్లకట్ట అందుకుని జేబులో పెట్టుకుని గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు.

లంచం ఇవ్వచూపిన విషయం తప్ప నేను సేకరించిన విషయాలను పొందుపరుస్తూ నోట్ తయారు చేసి సంతకం పెట్టి మా ఇన్‌ఛార్జ్‌కి ఇస్తూ నరసింహం గురించి చెప్పినప్పుడు నన్ను అభినందిస్తుంటే గర్వపడ్డాను. ''నరసింహాన్ని ఉద్యోగంలోంచి తీసేసి సదానందానికి ఉద్యోగం ఇప్పించాలి'' అన్నాడు. నా మనసులోని కోరికా అదే. ''వీలవుతుందా?'' అడిగాను. ''నేను ఇ.డి.లో మాట్లాడ్తాను. ఒక మంచి పని చేసిన వాళ్లమవుదాం. ఆయన అనుకుంటే ఎందుకు కాదు?'' అన్నాడు. మా ఇన్‌ఛార్జ్ ఇ.డి.కే రిపోర్టు చేస్తుంటాడు.

రెండు రోజుల వరకు నరసింహం ఫైలు జోషి గారి బల్లమీదే వుంది.మూడోరోజున కనబడలేదు. ఇ.డి. ఆఫీసుకు పంపించినట్లున్నారు. అప్రూవ్ అయిన తర్వాత అది అక్కడి నుండి పర్సనల్ డిపార్టుమెంటుకు వెళ్తుంది. డిసిప్లీనరీ ప్రొసిడింగ్స్ బాధ్యత వాళ్లది. మేం జోక్యం చేసుకోము.

నెలా పదిహేను రోజుల తర్వాత సాయంత్రం ఆఫీసు అయిపోయాక మా కంపెనీ బస్ బేలో నరసింహం కనిపించి, ''బావున్నారా?'' నవ్వుతూ అడిగాడు. అతని మెడలో కొత్త బంగారు గొలుసు మెరుస్తోంది. కేసు ఏమయిందో ఏమో? అతనికేం జరిగినట్టనిపించడంలేదు. నన్ను చూడగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చినట్లుంది. బావున్నట్లు తలూపాను.

''అప్పుడు మీరు ఒప్పుకుని వుంటే నా ఖర్చు తక్కువలో అయివుండేది'' అన్నాడు.

ఎవరి చేతులో తడిపి వుంటాడు. '' ఎంతయిందేమిటీ?'' అడిగాను.

''మీ బాస్ యాభైవేలు తీసుకున్నాడు. మా యూనియన్ వాళ్లు లక్షకు పైగా లాగారు'' వివరాలు చెబుతున్నాడు కాని నా మనసు అతని మాటల మీద లేదు. అతను చెబుతోంది నిజమో, అబద్ధమో తెలియడం లేదు. మా బాస్ లంచాలు తీసుకుంటాడని నాకు తెలియదు. ఆయన నాతో అన్నదొకటి, జరిగిందొకటి. నరసింహం ఇంకా ఏదో చెప్పబోతుంటే అతను ఎక్కాల్సిన బస్సు కదిలేసరికి ''మిమ్మల్ని మళ్లీ కలుస్తాను'' అని పరుగెత్తుకుంటూ వెళ్లి బస్సు అందుకున్నాడు. నాకు మా బస్సు ఎక్కాలనిపించలేదు. ఆఫీసుకు తిరిగొచ్చి సరాసరి పర్సనల్ డిపార్టుమెంటుకు వెళ్లాను. ప్రమోషన్ల సమయం అవటాన ఆఫీసయిపోయాక కూడా స్టాఫ్ ఉన్నారు. పావుగంట వెతికిన తర్వాత సదానందం అను నరసింహం ఫైలు దొరికింది. ఫైలు అట్ట మీద 'క్లోజ్డ్' అని స్టాంపు వేసివుంది. ఫైలు తెరిచి నోటు చదివాను. అది నేను పెట్టింది కానేకాదు. అందులో నా మాట ఒక్కటైనా లేదు. సదానందం అనే అతను మోసగాడని, అతను రాసిన విషయాలు పచ్చి అబద్ధాలని, అన్నీ ఆరా తీశామని రాసి టైప్ చేయించారు. కింద సంతకం మటుకు నాది కాదు. నా సంతకంలా పచ్చసిరాతో రాశారు. పచ్చ సిరా నేనెప్పుడూ వాడను. జోషి గారు వాడుతుంటారు. ఆ నోట్ మీద మటుకు ఆయన సంతకం నలుపు సిరాతో ఉంది, కింద అప్రూవ్డ్ అని ఇ.డి. సంతకం ఉంది.

వికలమైన మనసుతో ఫైలు తిరిగిచ్చేసి బయటకు వచ్చాను. బే ఖాళీగా ఉంది. కంపెనీ బస్సులన్నీ వెళ్లిపోయాయి. ఆర్టీసీ బస్టాండు వైపు నడుస్తోంటే నా మనసులో సదానందం కదలాడసాగాడు. ఈ సమయంలో అతను పొలంలో రాళ్లు ఏరుతూ ఉండొచ్చు. లేదూ వాళ్లూరి బస్టాండులో వేయించిన పల్లీలు అమ్ముతూ ఉండొచ్చు. లేదు మొక్కజొన్న కండెలే కాలుస్తూ ఉండొచ్చు. పిల్లలకు తెలియకుండా కూలీపని చేస్తూ ఉండొచ్చు. అతను బతకాలి. కష్టపడి తన పిల్లల్ని పోషించి, చదివించి పెద్ద చేయాలి. కాకపోతే జీవితం వక్రీకరించింది. లేకపోతే కంపెనీ ఉద్యోగంలో ఎంత దర్జాగా వుండాల్సిన వాడు.

★